
సాక్షి చిత్తూరు

గురువారం । 24 । ఆగస్టు । 2023

I



దుమ్మురేపిన ఎద్దుల పరుష

రామకుప్పంలో బుధవారం ఎద్దుల పరుగు పోటీలు దుమ్మురేపాయి. సుమారు 280 ఎద్దులు పోటీ పడ్డాయి.

-IIలో



దిశ తిరిగి.. దశ మారి

వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం ప్రోత్సాహకాలు అందుకుంటూ ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామిక వేత్తలుగా మారుతున్నారు.

-IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	25
తిరుపతి	34	23
తిరుమల	33	22
గూడూరు	38	28
నగరి	38	27

న్యూస్‌రీల్

26న ట్రస్టుబోర్డు సమావేశం

కాణిపాకం(యాదమరి): ఈనెల 26న కాణిపాకం దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ప్రకాశం పంతులు సేవలు ఎనలేనివి



ప్రకాశంపంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు ఎనలేనివని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ తుపాకీకి ఎదురునిలిచి గుండె చూపిన ధైర్యశాలి ప్రకాశం పంతులని అన్నారు. అకుంఠిత ధైర్యసాహసాలకు, అసమాన త్యాగనిరతికి నిదర్శనంగా నిలిచిన పంతులు ఆదర్శనీయమన్నారు. డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఎంఎస్సీ రసాయనశాస్త్రం బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9182320973 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,695 మంది స్వామివారిని దర్శించుకోగా.. 27,060 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అలాగే స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.



చంద్రుడిపై దిగుతున్న ల్యాండర్

మహిళా యూనివర్సిటీలో విజయకేతనం చూపుతున్న విద్యార్థినులు



విజయహో.. విక్రమ్

చందమామ అందిన వేళ.. జాబిల్లి దక్షిణ ధ్రువాన్ని విక్రమ ల్యాండర్ ముద్దాడిన వేళ.. అంతరిక్షంలో ఇస్రో విజయపతాకా హేల.. భారత కీర్తి ప్రతిష్టలు నింగిలోన విహరించిన వేళ.. నేలపై ఆనందాల కేళి.. అంబరాన్ని అంటింది. శ్రీహరికోటలోని షార్ నుంచి జూలై 14వ తేదీన ప్రయోగించిన చంద్రయాన్ 3 విక్రమ్ ల్యాండర్ బుధవారం చంద్రుడిపై దిగడంతో భారత అంతరిక్ష యానంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం అయ్యింది. దీంతో ఊరువాడా అంతటా సంబరాలు జరుపుకున్నారు. విజయహో విక్రమ్ అంటూ నినాదాలు చేశారు.

- సలాం ఇస్రో అంటూ విద్యార్థులనినాదాలు
- స్పేస్, చంద్రయాన్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలు
- శాస్త్రవేత్తలకు పలువురి ప్రశంసలు

తిరుపతి సిటీ: దేశం గర్వించదగ్గ చంద్రయాన్-3 చంద్రుడిపై అడుగుపెట్టింది. ఈ అపూర్వ ఘట్టాన్ని లైవ్‌లో తిలకించేందుకు మహిళావర్సిటీ ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియం ముస్తాబైంది. జూలై 14న నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన చంద్రయాన్-3 41రోజుల సుదీర్ఘ ప్రయాణం అనంతరం బుధవారం సాయంత్రం 6.04 నిమిషాలకు చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపింది. ప్రజ్ఞాన్ రోవర్ దిగిన ప్రాంతంలో నీరు, మంచు జాడలతో పాటు చంద్రునికి సంబంధించి రసాయనిక విశ్లేషణలు చేయనున్నట్లు అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. జాతీయ పతాకాన్ని చేతబూని జయహో చంద్రయాన్ అంటూ విశ్వవిద్యాలయాలు దద్దరిల్లిలేలా నినాదాలు చేశారు. ఎస్వీ యూనివర్సిటీ, కేంద్రీయ సంస్కృత విద్యాలయం, వెటర్నరీ వర్సిటీ, అగ్రికల్చరల్ కళాశాలలో విద్యార్థులు, అధికారులు అమర్చిన ఎల్ఈడీ స్క్రీన్లలో ఈ ఘట్టాన్ని తిలకించి ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇస్రో శాస్త్రవేత్తలకు సలామ్ అంటూ అభినందనలు తెలిపారు.



సైన్స్ సెంటర్‌లో జెండా ఊపుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న సెట్విన్ సీఈఓ మురళీకృష్ణారెడ్డి, సైన్స్ సెంటర్ అధికారులు

సైన్స్‌సెంటర్‌లో చంద్రయాన్ విజయోత్సవాలు

స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్‌లో చంద్రయాన్-3 విజయోత్సవాలు అంబరాన్నంటాయి. సైన్స్ సెంటర్ అధికారులు బుధవారం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై చంద్రయాన్-3 ల్యాండింగ్ ప్రక్రియను నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. ఉదయం నుంచి సైన్స్ సెంటర్ ప్రాంగణంలో నగరవాసుల హల్‌చల్ చేయడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. స్పేస్, బేసిక్ సైన్స్, చంద్రయాన్-3పై అధికారులు విద్యార్థులకు, నగరవాసులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం రోవర్ ల్యాండింగ్ సన్నివేశాలను తిలకిస్తూ జయహో చంద్రయాన్ అని నినాదాలు చేశారు. సైన్స్ సెంటర్ అధికారులు చంద్రయాన్-3 సక్సెస్ స్టోరీని, శాస్త్రవేత్తల శ్రమను వివరించారు.

చంద్రయాన్-3 విజయంపై భాకరాపేటలో సంబరాలు



జెండా పట్టుకుని నినదిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రునిపై అడుగు పెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. భాకరాపేటలో బుధవారం రాత్రి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగడానికి ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషిని ఎనలేనిదన్నారు. అనంతరం భాకరాపేటలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని భారత్ మాతాకీ జై అంటూ ప్రజలతో సంతోషాన్ని పంచుకున్నారు. సర్పంచ్ భూపాల్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.



సైన్స్ సెంటర్‌లో ఆనందోత్సాహాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు



ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతున్న మహిళావర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని అధ్యాపకులు



మహిళావర్సిటీలో విద్యార్థుల కేరింతలు

దేశానికే తలమానికం



చంద్రయాన్-3 విజయవంతం భారతదేశం గర్వించదగ్గ విషయం. శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తలు ప్రయోగించిన విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగడంతో భారత దేశ సామర్థ్యాన్ని శాస్త్రవేత్తలు ప్రపంచానికి తెలియజేశారు. ఇంతటి ఘన విజయం రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. శాస్త్రవేత్తలకు అభినందనలు. – డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గర్వకారణం



చంద్రయాన్ విజయవంతం కావడం దేశానికే ఎంతో గర్వకారణం. ఈ విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. అంతరిక్ష శోధనలో దేశ సామర్థ్యాన్ని భారత్ విశ్వవ్యాప్తంగా చాటింది. శ్రీవేంకటేశ్వరస్వామి కృపాకటాక్షాలతో మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం. ఇంతటి ఘన విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు. – భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే, తిరుపతి

చరిత్ర సృష్టించిన భారత్



చంద్రయాన్ -3 విజయవంతంతో భారత్ చరిత్ర సృష్టించింది. ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ కావడంతో భారత్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. ఈ విజయం ఇస్రో శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి నిదర్శనం. దేశమే గర్వించేలా చంద్రయాన్-3 విజయవంతం కావడానికి అహర్నిశలు కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి ఎంపీ శుభాకాంక్షలు. – మద్దిల గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలి



ఇస్రో మరన్ని విజయాలు సాధించాలి. చంద్రయాన్-3 విజయవంతంపై ఆయన స్పందిస్తూ చంద్రయాన్-2 వైఫ్యలం నుంచి పొందిన అనుభవనాలతో నేడు చంద్రయాన్-3ని ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. వారి కృషి, పట్టుదల ఎనలేనివి. ఈ విజయం భారతీయులుగా మనకు గర్వకారణం. ఈ ప్రయోగం రాష్ట్రం నుంచి జరగడంతో తెలుగువారిగా మనం గర్వపడాలి. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలి. – బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

ఈ ప్రాంత ప్రజల అదృష్టం



సూళ్లూరుపేట నియోజవర్గంలోని షార్ నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం. ఈ విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన మొట్టమొదటి దేశంగా భారత దేశం చరిత్రకు ఎక్కుతుంది. భవిష్యత్తులో ఇస్రో శాస్త్రవేత్తలు మరిన్ని విజయాలు సాధించాలి. – కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

విశ్వ గురువుగా భారత్



చంద్రయాన్-3 సేఫ్ ల్యాండింగ్ ఊహించిందే. అత్యంత సమర్థులైన శాస్త్రవేత్తలు ఇస్రోలో పనిచేస్తున్నారు. దేశ సామర్థ్యాన్ని ఇస్రో మరోసారి ప్రపంచానికి తెలియజెప్పింది. ఐఐటీ విద్యార్థులు ఎంతో ఉత్కంఠంగా విక్రమ్ రోవర్ ల్యాండింగ్ ప్రక్రియను పరిశీలించారు. భవిష్యత్‌లో స్పేస్, సైన్స్ టెక్నాలజీలో భారత్ విశ్వగురువుగా చలామణి అవుతుంది. ఇంతటి విజయం యువతకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నా. – ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ, తిరుపతి

భారత్ సత్తాను చాటారు



చంద్రయాన్-3 విజయవంతం పూర్తిగా మన శాస్త్రవేత్తల కృషికి తగిన ఫలితం. అంతరిక్ష రంగంలో భారతదేశ సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిపారు. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సాధించలేని ఘనతను భారత్ సాధించడం గర్వంగా ఉంది. -- ప్రొఫెసర్ బి దేవప్రసాద్ రాజు, ఎస్వీయూనివర్సిటీ

కాణిపాకం బ్రహ్మోత్సవ ఏర్పాట్లు వేగవంతం



సమావేశంలో సూచనలిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి) :కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని, సెప్టెంబర్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను దేవస్థానం ఈఓ వెంకటేశు ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం దేవస్థానం సమావేశ మందిరంలో ఆయా విభాగాల ఏఈఓలు, ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి నుంచి 21 రోజుల పాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను ముమ్మరం చేయాలని, సెప్టంబర్ 10వ తేదీ లోపు ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతు క్యూలు, పెయింటింగ్, ఎలక్ట్రికల్, మెయింటెనెన్స్ వర్క్‌ల పనులు వేగవంతం చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు, ఉభయదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను కూల్చిన చరిత్ర బాబుది

- పునర్ వైభవం తెచ్చిన ఘన చరిత్ర జగనన్నది
- దత్తపుత్రుడు పార్టీ మేనిఫెస్టో ప్రకటించాలి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ఆలయాలను కూల్చిన నీచ చరిత్ర చంద్రబాబుది అయితే, ఆలయాల నిర్మాణాలు చేపట్టిన ఘన చరిత్ర జగనన్నదని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలో కొటార్వేడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కూల్చేసిన ఆలయాలను పునర్నిర్మించిన ఘనత కూడా జగనన్నదేనని తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని సందర్శించిన దేవదాయ శాఖ మాజీ మంత్రి యల్లంపల్లి శ్రీనివాసులు అప్పట్లో మ్యాచింగ్ గ్రాంట్ లేకుండా దాదాపు 14 ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి జగనన్నతో కలసి ఆలయాల నిర్మాణాలకు సహకరించారని పేర్కొన్నారు. జగనన్న మేనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబుల్‌గా భావించి అన్ని సామాజిక వర్గాల వారికి సంక్షేమాలు అందిస్తున్నారని అన్నారు. చంద్రబాబును గెలిపించాలని తహతహలాడుతున్న బీసీల ద్రోహి పవన్‌కల్యాణ్ తన పార్టీ మేనిఫెస్టో ఏమిటో వివరించాలని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలంటున్న పవన్‌కల్యాణ్‌కు జగనన్న ఏం ద్రోహం చేశారో చెప్పాలన్నారు. నీతి, నిజాయితీకి కట్టుబడి, నిత్యం పేద ప్రజల కోసం పని చేస్తున్న జగనన్నపై ఎందుకు ఈ కక్ష అని ప్రశ్నించారు. చంద్రబాబు గజ్జికుక్క అయితే, లోకేష్ పిచ్చికుక్కలా మొరుగుతూ నాయకులను చంపుతానని బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. తండ్రి పుంగనూరు పర్యటనలో పోలీసులపై దాడులకు ప్రేరేపిస్తే, కొడుకు లోకేష్ ఏకంగా ఎదిరించిన వారిని చంపండని తమ్ముళ్లను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. పోలీసులపై, నాయకులపై రెచ్చగొడుతున్న తండ్రి, కొడుకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. సంక్షేమాలు అందిస్తున్నారు కాబట్టే జనం జగనన్న వైపే ఉన్నారని, అధికార దాహంతో ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు డిపాజిట్ కూడా రాదని, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ హైదరాబాద్‌కు పారిపోవడం ఖాయమని ఆరోపించారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

నగరి : ఈనెల 28వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నగరి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయలని అధికారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఈనెల 28న విద్యాకానుక లాంఛనంగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నగరికి రానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా అధికారులు, మున్సిపల్, మండల అధికారులతో కలసి బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ హెలిప్యాడ్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి రోడ్‌షోగా నగరి టవర్ క్లాక్, మున్సిపల్ ఆఫీసు మీదుగా సభా వేదిక వద్దకు రానున్న సందర్భంగా దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేయాలని నగరి కమిషనర్ వెంకట్రామిరెడ్డిని ఆదేశించారు. సభా వేదిక వద్ద ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 3 నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన ఏర్పాట్లను డీఆర్డీఏ పీడీ తులసి పర్యవేక్షించాలన్నారు. పర్యటనకు సంబంధించి శాఖలవారీగా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పకడ్బందీగా చేస్తున్నారన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ప్రతి మూ డు నెలలకు ఓటర్ల సవరణ ప్రక్రియలో మా ర్పులు చేర్పులు చేసి, జాబితా రూపొందిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలను అందిస్తామని చెప్పారు. పార్టీల ప్రతినిధులు మోహన్, చిట్టిబాబు, రాజసింహులు, సురేంద్రకుమార్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.59,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,400
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.71,000
రిటైల్ వెండి గ్రాము రూ.74.00

దిశ తిరిగి.. దశ మారి

- పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న ఎస్సీ ఎస్టీలు
- పరిశ్రమల స్థాపనకు చేయూతనిస్తున్న 'వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం'
- పెద్ద ఎత్తున సబ్సిడీలు, రాయితీలు అందిస్తున్న ప్రభుత్వం

దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకం కింద చేయూత నిస్తోంది. ఎస్సీ, ఎస్టీల్లో నైపుణ్యాలను మెరుగుపర్చి వారిని పారిశ్రామికవేత్తలుగా మారుస్తోంది. రూ.కోటి మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందిస్తోంది. పారిశ్రామిక పార్కుల్లో భూములు కేటాయిస్తోంది. జిల్లాలో ఈపథకం కింద పలువురు పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఎంతో మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. ఇది తమ అదృష్టంగా, దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నట్లు ముఖ్యమంత్రికి ఎస్సీ,ఎస్టీలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వీరు వరుసకు అన్నదమ్ములు చంద్ర, డేవిడ్. చంద్ర బీఈడీ, డేవిడ్ బీఏ వరకు చదువుకున్నారు. వీరు పలు ప్రైవేటు సంస్థల్లో పనిచేశారు. సొంతంగా పరిశ్రమ పెట్టాలని నిర్ణయించారు. పార్టనర్‌షిప్‌లో జీడీనెల్లూరులో 2017లో రూఫింగ్ పరిశ్రమను స్థాపించారు. అది ఆశాజనకంగా సాగడంతో జిల్లాలో గ్రానైట్‌కు ఉన్న డిమాండ్‌ను గుర్తించారు. అనంతరం వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం కింద దరఖాస్తు చేసుకున్నారు. రూ.2 కోట్ల బ్యాంకు రుణం పొంది మొత్తం రూ.3.50 కోట్ల పెట్టుబడితో జీడీనెల్లూరు ఇండ్రస్టీయల్ ఎస్టేట్‌లో గ్రానైట్ పరిశ్రమను పెట్టారు. ఇందులో ప్రభుత్వం వారికి రూ.కోటి సబ్సిడీని మంజూరు చేసింది. ప్రస్తుతం వీరి పరిశ్రమలో దాదాపు 50 మంది పనిచేస్తున్నారు. యూనిట్ విజయవంతంగా నడుస్తోందని ప్రభుత్వ తోడ్పాటును మరిచిపోలేమని వారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



పులిచెర్ల మండలం మంగళంపేట గ్రామానికి చెందిన మునిరత్నం పెద్దగా చదువుకోలేదు. వ్యవసాయం జీవనాధారానికి తోడ్పాటు ఇవ్వలేదు. వ్యాపారం చేయాలని భావించి గ్రామ చుట్టు పక్కల 6 కిలోమీటర్ల దూరంలో సిమెంటు రాళ్ల తయారీ పరిశ్రమ లేదని అధ్యయనం చేశాడు. వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం కింద బ్యాంకులో రుణం పొంది రూ.25 లక్షల పెట్టుబడితో స్వగ్రామంలో సిమెంటు రాళ్ల తయారీ పరిశ్రమను ప్రారంభించారు. సబ్సిడీ రూపంలో రూ.9.75 లక్షలు మంజూరు అయింది. 15 మందికి పని కల్పిస్తూ ఒకటిన్నర సంవత్సరంగా విజయవంతంగా ఇళ్ల, దుకాణాలు నిర్మాణానికి రాళ్లను విక్రయిస్తున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకం బడుగులను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తోందని, ఇది తమకు వరమని ఆనందం వ్యక్తం చేశారు.

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకం కింద పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. ఎస్సీ ఎస్టీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు 2020లో వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకం ప్రవేశపెట్టి ప్రత్యేక పాలసీని ప్రభుత్వం రూపొందించింది. స్టాంపు డ్యూటీ, వడ్డీ రాయితీ, క్వాలిటీ సర్టిఫికేషన్, పేటెంట్ రుసుముల్లో రాయితీలు కల్పించి ఆయా వర్గాలను ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీలు కేవలం శ్రామికులుగా మాత్రమే మిగిలిపోకూడదని, వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారికి 45 శాతం సబ్సిడీ అందిస్తోంది. గరిష్ఠంగా రూ.కోటి సబ్సిడీని అందిస్తోంది. పారిశ్రామిక వాడల్లో ఎస్సీలకు 16.2 శాతం, ఎస్టీ 7 శాతం మేర ఇండస్ట్రీయల్ పార్కుల్లో భూములు కేటాయిస్తోంది. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే యువతకు కావాల్సిన పూర్తి సహకారాన్ని అందిస్తోంది. వ్యవసాయ భూములను కమర్షియల్ భూములుగా మార్చేందుకు ప్రభుత్వమే రాయితీ ఇస్తోంది. స్టాంపు డ్యూటీ, పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీలు కల్పిస్తోంది. పెట్టుబడి(స్థలం, భవనం, యంత్రాలు) సబ్సిడీ కింద కోటి వరకు సబ్సిడీ ఇస్తోంది. వీటితో పాటు ఐదు సంవత్సరాలు ప్రతి యూనిట్‌పై రూ.1.50 విద్యుత్ సబ్సిడీ, వందశాతం సేల్స్‌ట్యాక్స్ రాయితీ, ఐదు సంవత్సరాలు, స్టాంప్ డ్యూటీ, తనఖా రిజిస్ట్రేషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. రానున్న నూతన పాలసీలో రూ.1.20 కోట్ల వరకు సబ్సిడీని పెంచనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ పరిశ్రమలకు సబ్సిడీ

ట్రాన్స్‌పోర్ట్, గ్రానైట్, ప్లాస్టిక్, పేపర్‌ప్లేట్స్, సిమెంటు బ్రిక్స్, ఆస్పత్రి, రూఫింగ్, రిపేయిర్, సర్వీసు, ప్రౌల్టీ, హోటల్, కన్వెన్షన్‌హాల్, పల్ప్ యూనిట్, స్వీట్ తయారీ పరిశ్రమ, బుక్‌బైండింగ్, స్టోన్‌క్రాసింగ్, సోప్‌మేకింగ్, యాసిడ్, ఫినాయిల్ విట్ అవుట్ మెషీనరీ, ఫోటో స్టూడియో, మైనింగ్, క్వారీ, ఎక్స్‌రే, ల్యాబ్, స్కానింగ్ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తున్నారు.



జీడీనెల్లూరులో స్థాపించిన గ్రానైట్ పరిశ్రమ



పులిచెర్లలో సిమెంట్ రాళ్ల తయారీ పరిశ్రమ

సంవత్సరం	కులం	యూనిట్లు	సబ్సిడీ మొత్తం రూ.కోట్లు
2020–21	ఎస్సీ ఎస్టీ	66 7	రూ.4.32 రూ.18.68లక్షలు
2021–22	ఎస్సీ ఎస్టీ	293 43	రూ.16.23 రూ.1.98
2022–23	ఎస్సీ ఎస్టీ	83 16	రూ.9.75 రూ.1.03
2023–24 (జులైవరకు)	ఎస్సీ ఎస్టీ	52 6	రూ.3.83 రూ.6.88
మొత్తం		566	రూ.38.05 కోట్లు

ఔత్సాహికులు ముందుకురావాలి



పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే జిల్లా ప్రగతి సాధ్యపడుతుంది. బడుగు వికాసం పథకం కింద ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను అన్ని విధాల ప్రోత్సమిస్తున్నాం. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తున్నాం. జిల్లా తమిళనాడు, కర్ణాటకకు సమీపంలో ఉండడంతో వ్యాపారానికి మంచి అవకాశం. ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలు ముందుకురావాలి. రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రశేఖర్, డీఐఓ, పరిశ్రమలశాఖ

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా సురేంద్రబాబు



ఐరాల: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన సురేంద్రబాబు నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ప్రకటించారు. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న ఈయనకు జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పోలాక్షమ్మ ఆలయంలో వివక్షకు తావులేదు

- కావాలనే కొందరు తప్పుదారి పట్టించారు
- తహసీల్దార్‌కు 7 గ్రామాల ప్రజల వినతి పత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పెద్దలు

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని గొల్లపల్లెలోని శ్రీపోలాక్షమ్మ ఆలయంలో వివక్షకు తావేలేదని దళితులు సైతం దర్శించుకుని పూజలు చేసుకోవచ్చని, షరతులు విధించేందుకు ఎవరికీ అధికారం లేదని ఏడు గ్రామాల పెద్దలు స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ పరమేశ్వరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దళితుల ప్రాథమిక హక్కు అయిన ఆలయ ప్రవేశం, పొంగళ్లు, అభిషే కం వంటి కార్యక్రమాలు ఎప్పటిలాగే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వందేళ్లుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కొందరు ఉద్దేశ పూర్వకంగా ఈనెల 20న ఆలయం మూసి ఉన్న సమయంలో వచ్చి దళితులకు ప్రవేశం లేకుండా చేశారంటూ ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఆలయ నిర్వాహకులు గానీ, ఏడు గ్రామాల ప్రజలు కానీ ఏనాడు దళితులను ఆలయంలోకి రావద్దని ఏన్నడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఇదే విషయన్ని దళితులు సైతం అధికారుల ముందు వాగ్మూలం ఇచ్చిన విష యాన్ని గుర్తు చేశారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం చేసిన తప్పుడు ప్రచారాన్ని గుర్తించి నిర్వహణ యథావిధిగా కొన సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు గొల్లపల్లె, పాతపల్లూరు, మిట్టపల్లూరు, కొళంకుప్పం, రామకృష్ణాపురం, కొత్తతిమ్మాపురం, కట్టకింద రామకృష్ణాపురం ప్రజలు ఆలయం వద్ద సమావేశమై తీర్మానించినట్లు వివరించారు.

దుమ్మురేపిన ఎద్దుల పరుష

- హోరాహోరీగా ఎద్దుల పరుగు పోటీలు
- రూ.లక్ష గెలుచుకున్న 'నంది ఎక్స్‌ప్రెస్'



ప్రథమ బహుమతిని అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ

రామకుప్పం: మండల కేంద్రంలో బుధవారం ఎద్దుల పరుగు పోటీలు దుమ్మురేపాయి. ఉదయం దేవర ఎద్దులను పురవీధుల్లో ఊరేగించి స్థానిక గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎద్దుల పరుగు పోటీలను ప్రారంభించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు కూడా పోటీలకు ఎద్దులను తీసుకొచ్చారు. సుమారు 280 ఎద్దులు పోటీ పడ్డాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో మండలంలోని తులసీనాయక్ తండా ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం నాయక్‌కు చెందిన నంది ఎక్స్‌ప్రెస్ ప్రథమ స్థానంలో నిలిచింది. రూ.లక్ష విలువ చేసే ద్విచక్ర వాహనాన్ని సుబ్రమణ్యం నాయక్ బహుమతిగా గెలుపొందారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన చోటాభీమ్ ఎద్దు ద్వితీయస్థానంలో నిలువగా, ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం, కెంపసముద్రంకు చెందిన ఓం శక్తి తృతీయ స్థానంలో రూ.40 వేలు గెలుచుకున్నారు. మొత్తం 50 బహుమతులను ఎద్దుల యజమానులకు నిర్వాహకులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో సందడి నెలకొంది.

కాంట్రాక్ట్ అధ్యాపకుల
పోస్టుల పునరుద్ధరణ



మాట్లాడుతున్న డీఆర్వో కోదండరామిరెడ్డి

తిరుపతి అర్బన్: కాంట్రాక్ట్ అధ్యాపకుల పోస్టులు పునరుద్ధరణ చేస్తున్నట్లు డీఆర్వో కోదండరామిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్వో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది డిగ్రీ కళాశాలల్లో అర్హత కలిగిన 26 మందిలో 23 మందికి జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేయడానికి ఆమోదం లభించిందని తెలిపారు. మరో ముగ్గురు జోన్ 3కి కేటాయిస్తున్నట్లు కమిటీ ఆమోదించిందని చెప్పారు. అధ్యాపకులు అనుభవం కలిగిన వ్యక్తులైన నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కమిటీ సమావేశంలో కమిటీ నోడల్ అధికారి, శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, పుత్తూరు, సత్యవేడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులురెడ్డి, సురేష్‌బాబు, మధుసూదన్ వర్మ, శంకరశర్మ, అరుణ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలకు జాతీయ ప్రశంసలు



సదస్సులో జమ్ముకశ్మీర్ గవర్నర్, కేంద్ర మంత్రితో భాస్కర్‌రెడ్డి, సూర్యకుమారి, శ్రీనివాసరావు

పుంగనూరు: జమ్ముకశ్మీర్‌లో గుడ్ గవర్నెన్స్, పంచాయతీరాజ్ పాలనపై జరిగిన జాతీయ సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, సచివాలయ వ్యవస్థపై పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఉపన్యాసం అభినందనలు అందుకుంది. జమ్ముకాశ్మీర్‌లో ఈనెల 21 నుంచి బుధవారం వరకు అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల బృందాలతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. ఇందులో ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న పనితీరు ను వివరించేందుకు ఒక్కో రాష్ట్రం నుంచి ఏడుగురు సభ్యుల బృందాన్ని ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన బృందంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఉన్నారు. ముగింపు సమావేశాల్లో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, నవరత్నాలను ప్రవేశపెట్టి, అర్హతే ప్రామాణికంగా పథకాలను ప్రభుత్వం అందిస్తున్నారని తెలపడంతో సభికులు కరతాళ ధ్వనులతో ప్రశంసించారు.

భూ కబ్జా యత్నం కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు తేనబండ రెవెన్యూ భూముల వద్ద ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఇక్కడున్న రూ.కోట్ల విలువజేసే భూమిని కాజేసేందుకు కొందరు జేసీబీల ద్వారా కొండలను తవ్వుతుంటే రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లారు. అధికారుల విధులను అడ్డుకోవడం, దుర్భాషలాడడంతో చిత్తూరు తాహసీల్దార్ మురళీమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న అల్తాఫ్, కార్తీక్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. అనంతరం నిందితులకు నోటీసులు జారీ చేసి, విడుదల చేశారు. కాగా కొండలు చదును చేసేందుకు ఉపయోగించిన జేసీబీను సీజ్ చేసి సీఐ తెలిపారు.

524 విద్యుత్ చౌర్యం కేసుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,241 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 99, తిరుపతి రూరల్‌లో 57, పుత్తూరు 81, చిత్తూరు అర్బన్ 53, చిత్తూరు రూరల్ 72, మదనపల్లె 66, పీలేరు 21, పుంగనూరు పరిధిలో 75 విద్యుతు చౌర్యం, అపరాధ రుసుం పరంగా కేసులు నమోదు చేశారు. మొత్తం 524 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.11.36 లక్షలు అపరాధరుసుం, జరిమానా రూపంలో చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

చిత్తూరులో బాలిక అదృశ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో 16 ఏళ్ల బాలిక అదృశ్యమైంది. సోమల మండలం శీలంవారిపల్లెకు చెందిన బాలిక ఇటీవల చిత్తూరులోని డి.వెంగనపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఈనెల 18వ తేదీన ఇంట్లో నుంచి ఊరికి బయలుదేరిన బాలిక కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గత నెల 31న జరిగిన వివాహిత హత్య కేసులో భర్త తమిళ్‌కుమార్ (39)ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చెన్నైకు చెందిన సుకన్య, రెండో భర్త తమిళ్‌కుమార్‌తో కలిసి గతనెల పనికోసం చిత్తూరుకు వచ్చారు. చిత్తూరులోని సాంబయ్య కండ్రిగ వద్ద బంధువుల ఇంట్లో కాపురంపెట్టగా.. సుకన్యపై అనుమానంతో తమిళ్‌కుమార్ కత్తితో నరికి చంపి పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తమిళ్‌కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాంబయ్య కండ్రిగ కూడలిలో ఉండగా నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాలతో జిల్లా జైలుకు పంపించారు.

రైలులో గొంతు కోసుకున్న బెంగాల్ వాసి



చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

గుడిపాల/చిత్తూరు(కార్పొరేషన్): బెంగుళూరు నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ఓ వ్యక్తి బ్లేడుతో తన గొంతును తానే కోసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన టాషరింగ్ బుటియా(41)అనే వ్యక్తి శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. చిత్తూరుకు బుధవారం సాయంత్రం 4 గంటలకు రావాల్సిన రైలు రాత్రి 7:45 గంటలకు వచ్చింది. టాషరింగ్ బుటియా అనే వ్యక్తి రైలులో ప్రయాణిస్తున్నాడు. కాట్పాడి రైల్వేస్టేషన్ నుంచి రైలు బయలుదేరిన కొంతసేపటికి అతను బాత్‌రూంలో నుంచి గొంతు కోసుకొని బయటకు రావడంతో ప్రయాణికులు చూసి ఒక్కసారిగా కేకలు వేశారు. ఆ సమయంలో రైలులో ప్రయాణికులు అతన్ని అడగ్గా తానే గొంతుకోసుకున్నానని తెలపడంతో, చిత్తూరు రైల్వే పోలీసులకు ప్రయాణికులు సమాచారం అందించారు. ఇంతలో గుడిపాల మండలంలోని పేయనపల్లె రైల్వేస్టేషన్ వద్ద ట్రాకింగ్ పనులు జరుగుతుండడంతో రైలు మెల్లగా వెళుతోంది. దీంతో టాషరింగ్ బుటియా రైలు నుంచి కిందకు దూకేశాడు. వెంటనే గుడిపాల ఎస్ఐ చలపతికి సమాచారం రావడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. రైల్వే పోలీసులకు సంబంధించిన కేసు కాబట్టి వారికి తెలియజేశారు. సంఘటన విషయంపై టాషరింగ్ బుటియాను అడగ్గా అప్పటికే గొంతుకోసుకుని ఉండడంతో మాటలు రాక ఏమి చెప్పలేకపోయాడు. ఎవరైనా కావాలని చేశారా లేక తనే గొంతుకోసుకున్నాడా అన్న విషయం తెలియాల్సి ఉంది. అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.